సాక్షి అనంతపురం

శుక్రవారం । 1 । మార్చి । 2024



పేదలకు పోషకాహారం

పేదల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నేటి నుంచి రాగి పిండి పంపిణీ చేయనుంది. 8లో



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
38.2°/16.1°

జిల్లా అంతటా గురువారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రిళ్లు స్వల్పంగా తగ్గడంతో వేకువజామున చలి వాతావరణం నెలకొంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.

సర్కారు బడి సుందరం


నాడు

- ఇది అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీలోని పిల్లిగుండ్లకాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాల. 2019 వరకు ఇలా ఉండేది. అప్పుడెప్పుడో ఏళ్ల కిందట నిర్మించిన భవనం పాతమిద్దెలా తయారైనా ఇందులోనే పిల్లలకు చదువు చెబుతూ వచ్చారు. 1 నుంచి 8వ తరగతి వరకు 230 మంది విద్యార్థులు ఉండేవారు.


నేడు

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అదే పాఠశాల ఇలా తయారైంది. లక్షా రెండు లక్షలు కాదు 'మనబడి నాడు-నేడు' కార్యక్రమం కింద ఏకంగా ఈ ఒక్క పాఠశాలకే రూ. 2.33 కోట్లు మంజూరు చేశారు. తరగతి గదులు మొదలుకుని ప్రహరీ, కిచెన్, మరుగుదొడ్లు, ఆర్‌ఓ ప్లాంటు, రిపేరీలు, పెయింటింగ్, ఎలక్ట్రికల్ వర్క్స్, ఫర్నీచరు తదితర వాటిని ఏర్పాటు చేశారు. ఇప్పుడు కార్పొరేట్ పాఠశాలకు దీటుగా కనిపిస్తోంది. గతంలో ఈ ప్రాంతం నుంచి పిల్లలను బయట స్కూళ్లకు పంపే తల్లిదండ్రులు.. నేడు ఇదే స్కూలులో చేర్పించేందుకు క్యూ కట్టారు. ఒకప్పుడు 230 మంది ఉన్న విద్యార్థుల సంఖ్య ఇప్పుడు ఏకంగా 482 మందికి చేరింది. అంటే దాదాపు 120 శాతం మందికి పైగా పెరిగారు. ఇదొక్కటే కాదు సర్కారు చేయూతతో జిల్లాలో వందల స్కూళ్లు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరాయి.

నాడు-నేడు.. తేడా చూడు

- 'మనబడి నాడు-నేడు'తో కార్పొరేట్‌ను తలపిస్తున్న ప్రభుత్వ స్కూళ్లు
- జిల్లాలో తొలివిడతలో 698 స్కూళ్లకు రూ. 201 కోట్ల ఖర్చు
- రెండో విడతలో 1,079 స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 'నాడు-నేడు' పనులు
- రూ.384.67 కోట్ల కేటాయింపు.. ఇప్పటిదాకా రూ. 180 కోట్ల ఖర్చు

అనంతపురం ఎడ్యుకేషన్: బడి మారింది. రాష్ట్రంలో ఏ మారుమూల గ్రామాలకు వెళ్లినా ఈ విషయం చెబుతారు. గత ప్రభుత్వాల అలసత్వంతో నిర్వీర్యమైన ప్రభుత్వ విద్యావ్యవస్థకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రాణం పోశారు. సర్కారు బడుల్లో చదువుకునే నిరుపేద విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు శ్రీకారం చుట్టారు. పేదరికాన్ని చదువుతోనే నిర్మూలించవచ్చని నమ్మిన ముఖ్యమంత్రి పేద విద్యార్థులు ఆసక్తిగా చదువుకునేందుకు వీలుగా వసతుల కల్పనకు నడుం బిగించారు.

గతంలో ఇలా...

ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల మరమ్మతులకు నోచుకోక, విద్యుత్ సదుపాయం, స్వచ్ఛమైన తాగునీటి వసతి, తగిన ఫర్నీచర్, మరుగుదొడ్లు లేక అధ్వాన స్థితిలో ఉండేవి. బాలికలు వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవాలంటే పాఠశాలల సమీపంలోని ముళ్లపొదలు, గోడచాటుకు వెళ్లాల్సిన దుస్థితి. దాతల సహకారంతో కొన్ని పాఠశాలల్లో అంతోఇంతో సౌకర్యాలు కల్పించుకునేవారు. పాఠశాల సమయం తర్వాత మరుసటి రోజు వరకు పాఠశాలల గురించి పట్టించుకునే నాథుడే ఉండేవాడు కాదు. దీంతో రికార్డులు, ఇతర విలువైన వస్తువులు చోరీ అయ్యేవి. దీనికితోడు అల్లరిమూకలు తాగి పడేసిన మందు బాటిళ్లు, వాటర్‌ప్యాకెట్లు స్కూళ్ల ఆవరణాల్లో కనిపించేవి.

ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి

విద్యా హక్కు చట్టం గొప్పతనాన్ని చాటుతూ అత్యంత కీలకమైన మౌలిక వసతుల కల్పనకు 2019లో 'మనబడి నాడు-నేడు' కార్యక్రమం ద్వారా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నీటి వసతితో కూడిన మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా (ఆర్‌ఓ ప్లాంట్లు), విద్యుదీకరణతో పాటు ప్రతి గదికి ట్యూబ్‌లైట్, ఫ్యాన్లు, మేజర్, మైనర్ మరమ్మతులు, విద్యార్థులు, టీచర్లకు ఫర్నీచర్, కిచెన్ షెడ్లు, గ్రీన్ చాక్ బోర్డు, ప్రహరీ గోడలు, అదనపు తరగతి గదులు, పెయింటింగ్ తదితర పనులు చేపట్టింది. మరుగుదొడ్ల నిర్వహణ కోసం ఆయాలను నియమించారు. ప్రతి స్కూల్ ఆస్తులను కాపాడుకునే క్రమంలో పాఠశాలలకు వాచ్‌మన్‌ను నియమించారు. జిల్లాలో తొలివిడతలో 698 స్కూళ్లకు రూ. 201 కోట్లు ఖర్చు చేయగా, 2021లో ప్రారంభమైన రెండో విడతలో 1,079 స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 'నాడు-నేడు' పనులు జరుగుతున్నాయి. రూ.384.67 కోట్ల కేటాయింపులు జరగగా ఇప్పటిదాకా రూ. 180 కోట్లు ఖర్చు చేశారు. ఫలితంగా కార్పొరేట్ పాఠశాలలను మించి ప్రభుత్వ పాఠశాలలు కనిపిస్తున్నాయి.

బాగా చదువుకుంటున్నాం



మా పాఠశాలలో మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. నాడు-నేడు పనులతో బాలబాలికలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు నిర్మించారు. ప్రతి తరగతి గదినీ పెయింటింగ్‌తో అందంగా తీర్చిదిద్దారు. లైట్లు, ఫ్యాను ఏర్పాటు చేశారు. పేద విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే జగనన్న ఆశయాలకు అనుగుణంగా బాగా చదువుకుంటున్నాం.

– బి.కార్తీక్ 10వ తరగతి
మరూరు జెడ్పీహెచ్‌ఎస్

జగన్ మామయ్యకు థ్యాంక్స్



నాడు-నేడు కార్యక్రమం కింద ప్రతి తరగతి గదిలోనూ ఫర్నీచరు ఏర్పాటు చేశారు. గతంలో నేలపై కూర్చునేవాళ్లం. బాత్రూం పోవాలంటే చాలా ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు చక్కటి మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. మా పాఠశాలను ఒక నందనవనంలా మార్చిన జగన్ మామయ్యకు థ్యాంక్స్.

– కె.మైత్రి, 9వ తరగతి
మరూరు జెడ్పీహెచ్‌ఎస్

పేద పిల్లల భవితకు ఉజ్వల బాటలు



నేను ప్రధానోపాధ్యాయుడిగా పాఠశాలలో నాలుగున్నరేళ్ల కిందట బాధ్యతలు తీసుకున్నా. అప్పట్లో తగిన బాత్రూం సౌకర్యం లేదు. తరగతి గదులు కూడా సౌకర్యవంతంగా ఉండేవికావు. నల్లబల్లలు ఎగుడు దిగుడుగా రాయడానికి ఇబ్బందిగా ఉండేవి. విద్యార్థులు తాగు నీటి కోసం సమీపంలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లేవారు. కాంపౌండ్ లేక పాఠశాల ఆవరణలోకి వర్షం నీరంతా వచ్చి చెరువును తలపించేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన 'మనబడి నాడు-నేడు' కార్యక్రమంతో మా పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. పేద పిల్లల భవితకు ఉజ్వల బాటలు పరిచారు.

– ధర్మపురి వెంకటేశు, ప్రధానోపాధ్యాయుడు, శ్రీ పొట్టి శ్రీరాములు
నగరపాలకోన్నత పాఠశాల, అనంతపురం

ఈస్థాయి వసతులు ఊహించలేదు



ప్రభుత్వ పాఠశాలల్లో ఈస్థాయిలో వసతులు కల్పిస్తారని ఊహించలేదు. 'మనబడి నాడు-నేడు' పనులతో మా పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. ప్రతి గదిలోనూ లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు నిర్మించారు. పెయింటింగ్ చేశారు. అత్యాధునికంగా మరుగుదొడ్లు నిర్మించారు. తాగునీటి కోసం ఆర్‌ఓ ప్లాంటు ఏర్పాటు చేశారు. పేద విద్యార్థులు చదువుకునే పాఠశాలల్లో కార్పొరేట్‌స్థాయిలో వసతులు, బోధన పరికరాలు సమకూర్చారు.

– పట్నం శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు, పొట్టిశ్రీరాములు
నగరపాలక ఉన్నత పాఠశాల, అనంతపురం

ఆల్ ది బెస్ట్

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- నిర్దేశిత సమయానికి నిమిషం ఆలస్యమైనా నోఎంట్రీ


అనంతపురంలోని ఓ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కన్వీనర్ వెంకటరమణనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ప్రథమ సంవత్సరం, శనివారం ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమవుతాయి. ఈ నెల 20 వరకు సాగుతాయి. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయి. జిల్లాలో మొత్తం 58 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సరం (జనరల్) 22,378 మంది, ఒకేషనల్ 2,068, ద్వితీయ సంవత్సరం (జనరల్) 15,992, ఒకేషనల్ 1,118 మంది మొత్తం 41,556 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా..

పరీక్షల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఫర్నీచరు, తాగునీరు, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ప్రశ్నపత్రాలు స్టోరేజీ పాయింట్లకు చేర్చారు. మొత్తం 58 మంది సీఎస్‌లు, 58 మంది డీఓలతో పాటు సుమారు 870 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. జిల్లా పరీక్షల కన్వీనర్ వెంకటరమణనాయక్, సభ్యులు శంకరయ్య, షఫి, జగన్నాథ్‌తో పాటు ఇతర ప్రత్యేక బృందాలు పరీక్షలను పర్యవేక్షిస్తాయి.

ప్రతి కేంద్రంలో సీసీ కెమెరా..

అన్ని కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌ఐఓ కార్యాలయం, విజయవాడలోని ఇంటర్ బోర్డు కార్యాలయానికి అనుసంధానం చేశారు. జిల్లా, రాష్ట్ర అధికారులు అక్కడి నుంచే పర్యవేక్షించే వీలుంటుంది.

8.30 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలి

ఇంటర్ పరీక్షలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి. విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని పరీక్షల జిల్లా కన్వీనర్ వెంకటరమణనాయక్ సూచించారు. 9 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని స్పష్టం చేశారు. విద్యార్థులు తమవెంట కచ్చితంగా హాల్‌టికెట్ తెచ్చుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతరం విద్యుత్తు సదుపాయం ఉండేలా సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. పరీక్షల వేళలకు అనుగుణంగా ఆర్టీసీ యాజమాన్యం బస్సులు నడుపుతుందన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసేయాల్సిందేనని స్పష్టం చేశారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

నేడు 'జగనన్న విద్యా దీవెన' విడుదల

అనంతపురం రూరల్: పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. 'జగనన్న విద్యా దీవెన' పథకం ద్వారా చేయూతనందిస్తోంది. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి కళాశాల ఫీజులను తల్లుల ఖాతాల్లో జమ చేసేందుకు సర్వం సిద్ధం చేసింది. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణా జిల్లా పామర్రులో జరిగే సమావేశంలో కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. జిల్లాలో 40,006 మంది విద్యార్థులకు సంబంధించి 36,260 మంది తల్లుల ఖాతాల్లో రూ. 29.08 కోట్ల నగదు జమ కానుంది. ఎస్సీ విద్యార్థులు 7,104 మందికి రూ. 4.69 కోట్లు, ఎస్టీ విద్యార్థులు 1,635 మందికి రూ. 1.15 కోట్లు, బీసీ విద్యార్థులు 19,968 మందికి రూ.13.94 కోట్లు, కాపు విద్యార్థులు 2,298 మందికి రూ.1.84 కోట్లు, ఈబీసీ విద్యార్థులు 4,987 మందికి రూ. 4.69 కోట్లు, ముస్లిం మైనార్టీ విద్యార్థులు 3,907 మందికి రూ. 2.70 కోట్లు, క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులు 107 మందికి రూ.0. 07 కోట్ల మేర లబ్ధి కలగనుంది. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు తెలిపారు.

మా 'స్థాయి'ని దిగజారుస్తారా?

- జెడ్పీ సీఈఓ తీరుపై జెడ్పీటీసీల నిరసన
- స్థాయీ సంఘ సమావేశాల బాయ్‌కాట్


సీఈఓ తీరుపై నిరసన తెలుపుతున్న జెడ్పీటీసీ సభ్యులకు మద్దతుగా మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: దళిత జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజును జెడ్పీ సీఈఓ అవమానించారంటూ సభ్యులు నిరసన తెలిపారు. సదరు సభ్యుడికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతపురంలోని జెడ్పీ సమావేశ భవనంలో ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు గురువారం ఉదయం 11.30కు ప్రారంభమయ్యాయి. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ చర్చను ప్రారంభిస్తుండగా.. గుడిబండ జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, వజ్రకరూరు జెడ్పీటీసీ సభ్యురాలు కురుబ తేజస్విని సహా మరికొంత మంది పోడియం ముందు బైఠాయించారు. తమ మండలంలో చేసిన, చేయాల్సిన అభివృద్ధి పనుల గురించి చర్చించేందుకు రెండు రోజుల క్రితం జెడ్పీ కార్యాలయానికి వస్తే సీఈఓ అవమానించారని భూతరాజు ఆవేదన వ్యక్తం చేశారు. తనను కలిసేందుకు సీఈఓ రెండు గంటలైనా అపాయింట్‌మెంట్ ఇవ్వకపోగా, ఆ తరువాత పిలిచి అగౌరవపరిచారని వాపోయారు. 'నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలు' అంటూ సాక్షాత్తు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటుంటే, బాధ్యత గల హోదాలో ఉన్న అధికారిణి చిన్నచూపు చూడటం సరికాదన్నారు. జెడ్పీటీసీ భూతరాజుకు సహచర సభ్యులు సంఘీభావం తెలిపారు. సీఈఓ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ కూడా వేదికపై నుంచి వచ్చి వారికి మద్దతు ప్రకటించారు. ఈ క్రమంలోనే సీఈఓ నిదియాదేవి సమావేశం నుంచి వెళ్లిపోవడంతో, సభ్యులు కూడా బాయ్‌కాట్ చేశారు.

టీడీపీ కాంట్రాక్టర్లకు కోట్లాది రూపాయలు ఎలా పంచుతారు?

పనులు చేసిన కాంట్రాక్టర్లందరినీ సమానంగా చూడాల్సిన జెడ్పీ అధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకొంటూ టీడీపీ కాంట్రాక్టర్లకు కొమ్ము కాస్తున్నారని సభ్యులు మండిపడ్డారు. తాగునీటి పథకాల ఆపరేషన్, మెయింటెనెన్స్(ఓ అండ్‌ఎం)కు సంబంధించి గతంలో సీఈఓగా పని చేసిన అధికారితో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహసాన్ బాషా, ఈఈ, జెడ్పీలోని డీ సెక్షన్‌లో పని చేసే ఓ సీనియర్ అసిస్టెంట్ జత కలసి టీడీపీకి చెందిన కాంట్రాక్టర్ల బిల్లులు అప్‌లోడ్ చేసి, రూ. కోట్లు ఎలా చెల్లిస్తారని నిలదీశారు. మిగతా కాంట్రాక్టర్లకు మాత్రం పైసా చెల్లించకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటారా అంటూ దుయ్యబట్టారు. పర్సంటేజీల కోసమే ఇలా చేశారని ఆరోపించారు. వాటిని రద్దు చేసి, కొత్త సీఈఓతో బిల్లులు చేయించాలని ఏకగ్రీవంగా తీర్మానించినా ఎందుకు పక్కన పెట్టారని ప్రశ్నించారు. జెడ్పీ సీఈఓ నిదియా దేవి, డిప్యూటీ సీఈఓ లలితాబాయి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహసాన్ బాషా, ఈఈ, డీ సెక్షన్‌లోని ఓ సీనియర్ అసిస్టెంట్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేయాల్సిందేనని సభ్యులు పట్టుబట్టారు. రెండు రోజుల్లో తమ సమస్య పరిష్కారం కాకపోతే.. నేరుగా విజయవాడకు వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలసి సమస్యను విన్నవిస్తామని స్పష్టం చేశారు.

అద్దె మనుషులతో హడావుడి

- టీడీపీ అభ్యర్థి అమిలినేని ఓవరాక్షన్
- అసహ్యించుకున్న జనం

కళ్యాణదుర్గం: నియోజకవర్గ టీడీపీ టికెట్ దక్కించుకున్న అనంతరం గురువారం తొలిసారిగా పట్టణానికి వచ్చిన కాంట్రాక్టర్, ఎస్‌ఆర్‌సీ సంస్థ అధినేత అమిలినేని సురేంద్రబాబు అద్దె మనుషులతో హడావుడి చేశారు. టికెట్ తమకు రాకపోవడంతో అలకబూనిన మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, టీడీపీ ఇన్‌చార్జ్ ఉమా మహేశ్వర నాయుడు కార్యక్రమానికి దూరంగా ఉండడంతో.. తనకు డ్యామేజీ ఏర్పడుతుందని గుర్తించి పెయిడ్ కార్యకర్తలను రప్పించుకున్నారు. డబ్బు, మద్యం, బిరియానీలతో ప్రలోభాలకు గురి చేసి ఉరవకొండ, గుంతకల్లు, అనంతపురం అర్బన్ ప్రాంతాల నుంచి తీసుకొచ్చి బలం చాటుకునేందుకు అవస్థలు పడ్డారు.

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీల చించివేత

అమిలినేని రాక సందర్భంగా కళ్యాణదుర్గంలో ఆయన ప్రైవేటు సెక్యూరిటీని ఏర్పాటు చేసి హల్ చల్ చేశారు. సాయిబాబా ఆలయం నుంచి టీ సర్కిల్, ఇతర ప్రధాన కూడళ్లలో నిలబెట్టి అమిలినేని కాన్వాయ్ వచ్చే సమయంలో ఇతర వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. వారికి తోడుగా టీడీపీ కార్యకర్తలు మద్యం మత్తులో విచ్చలవిడిగా ప్రవర్తించారు. కళ్యాణదుర్గంలోని రాజీవ్ గాంధీ బస్టాండ్ సమీపంలో వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను టీడీపీ కార్యకర్తలు చించేశారు. వారి ఓవరాక్షన్‌తో అమిలినేనికి స్వాగతం పలికేందుకు స్థానిక జడ్జి బంగ్లా సమీపంలో ఏర్పాటు చేసిన గజమాల కూడా ఆయన రాక ముందే తెగిపోయింది. అమిలినేని వర్గీయుల తీరును చూసి స్థానికులు అసహనం వ్యక్తం చేశారు.

అనంతపురంలోనూ ఓవరాక్షన్

అనంతపురం క్రైం: అనంతపురంలోనూ అమిలినేని వర్గీయులు ఓవరాక్షన్ చేశారు. సంబరాల పేరిట గురువారం ఉదయం రెండు గంటల పాటు కోర్టు రోడ్డును దిగ్బంధనం చేశారు. సమీపంలో పాఠశాలలు, కోర్టు ఉన్నాయనే విషయం మర్చిపోయి టపాసులు పేలుస్తూ హల్ చేశారు. దీనిపై స్థానికులు, వాహనదారులు మండిపడ్డారు. ఇలాంటి వారు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి సమాజ సేవ చేస్తారా? అంటూ ప్రశ్నించారు. అనుమతి లేకుండా టపాసులు పేల్చడం, రోడ్లపై హల్‌చల్ చేస్తున్నా పోలీసులు కూడా పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు.


రాజీవ్ గాంధీ బస్టాండ్ వద్ద టీడీపీ కార్యకర్తలు చించేసిన వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు

న్యూస్‌రీల్

భద్రత పటిష్టంగా ఉండాలి


ఈవీఎంలు భద్రపరిచిన గదులకు వేసిన సీలును పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ఈవీఎంలకు భద్రత పటిష్టంగా ఉండాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. పాత ఆర్‌డీఓ కార్యాలయ ఆవరణలో ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను కలెక్టర్ గురువారం రాత్రి అకస్మికంగా తనిఖీ చేశారు. భద్రత చర్యలను పరిశీలించారు. సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా..? పోలీసు బందోబస్తు ఎలా ఉంది..? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు భద్రపరిచిన గదులకు వేసిన సీలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవీఎంల భద్రత విషయంలో రాజీ పడకూడదన్నారు. అనుక్షణం పటిష్ట బందోబస్తు కొనసాగిస్తూ ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఆర్‌డీఓ గ్రంధి వెంకటేష్, సూపరింటెండెంట్ రవికుమార్, ఎలెక్షన్ సెల్ ఎస్‌ఏ శామ్యూల్ బెంజిమన్, ఐటీ అసిస్టెంట్ శివ, తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ లేకుండా పన్ను చెల్లించొచ్చు

- ఈ నెల 31 వరకు అవకాశం


అనంతపురం కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు శుభవార్త చెప్పింది. ఇంటి, ఖాళీ జాగా పన్ను (అరియర్స్, డిమాండ్) ఒకేసారి చెల్లిస్తే ఎటువంటి వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదని సూచించింది. ఈ మేరకు గురువారం జీఓ విడుదల చేసింది. మార్చి 31 వరకు అవకాశం కల్పించింది. ప్రభుత్వం నిర్ణయంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోక్సో కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు



అనంతపురం: పోక్సో కేసులో ఇద్దరు ముద్దాయిలకు పదేళ్ల జైలు శిక్ష పడింది. కర్ణాటక రాష్ట్రానికి చెందిన సెల్వరాజ్ అలియాస్ వడ్డీ కెల్లా సెల్వరాజ్, తమిళనాడు రాష్ట్రానికి చెందిన చందిరన్ కుల్లప్పన్ అలియాస్ చంద్రుడు నల్లమాడ మండలంలోని ఓ గ్రామంలో ఉన్న గ్రానైట్ క్వారీలో పనిచేసేవారు. 2022న మే 15న ఓ బాలిక పొలంలో గడ్డి కోస్తుండగా బలాత్కారం చేశారు. బాలిక అరుపులు విని తల్లిదండ్రులు అక్కడికి రాగా, ముద్దాయిలు పారిపోయారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు నల్లమాడ పోలీసుస్టేషన్‌లో అప్పటి ఎస్‌ఐ వలి భాష కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతపురం స్పెషల్ సెషన్స్ జడ్జి (పోక్సో ట్రయల్ కేసెస్) కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఏడుగురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి.. గురువారం తీర్పు వెలువరించారు. నేరం రుజువు కావడంతో నిందితులకు పదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ.2 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి సూచించారు. సాక్షులను కోర్టులో హాజరుపరిచి, ముద్దాయిలకు శిక్ష పడేందుకు కృషి చేసిన డీఎస్పీ వాసుదేవన్, సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, కానిస్టేబుల్ గంగాధర్‌ను శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఈ సందర్భంగా అభినందించారు.

చింతపండుకు రికార్డు ధర


మార్కెట్‌కు గురువారం వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: చింతపండు రికార్డు ధర పలుకుతోంది. గురువారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో ఈ ఏడాదిలోనే గరిష్ట ధర పలికింది. మార్కెట్‌కు 2,438 క్వింటాళ్ల సరకు రాగా, ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. అందులో కరిపులి రకం (ప్రథమశ్రేణి) క్వింటా గరిష్టంగా రూ.34 వేలు, కనిష్టంగా రూ.8 వేలు, సగటున రూ.12 వేల ప్రకారం పలికింది. అలాగే ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.10 వేలు, కనిష్టంగా రూ.4 వేలు, సగటున రూ.6 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి. ఇక బోటు రకం చింతపండు గరిష్టంగా రూ.3,500, కనిష్టంగా రూ.2,500, సరాసరిన రూ.3 వేల ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ యార్డు కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు.

'జగనన్న పాలవెల్లువ'ను సద్వినియోగం చేసుకోండి

- మహిళా పాడి రైతులకు కలెక్టర్ గౌతమి సూచన


పాల సేకరణను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆత్మకూరు: ప్రైవేటు డెయిరీల కంటే లీటర్‌కు అధిక ధర చెల్లిస్తున్న నేపథ్యంలో 'జగనన్న పాల వెల్లువ' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహిళా పాడి రైతులకు కలెక్టర్ గౌతమి సూచించారు. గురువారం ఆత్మకూరు మండలంలోని వడ్డుపల్లి, పంపనూరు తండాల్లో ఆమె పర్యటించారు. 'జగనన్న పాల వెల్లువ' కింద చేపడుతున్న పాల సేకరణను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఎంత మంది పాడి రైతులు ఉన్నారు, ఎన్ని లీటర్ల పాలు ఏఎంసీయూలకు పోస్తున్నారు, లీటరుకు ఎంత ఆదాయం వస్తుంది తదితర వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'జగనన్న పాల వెల్లువ'తో కలిగే ప్రయోజనాలను మహిళా పాడి రైతులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ప్రమోటర్లు కీలక పాత్ర పోషించాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా పాల సేకరణ జరిగేలా చూడాలన్నారు. పాల ఉత్పత్తిదారులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఎంత లాభం వస్తుంది అనే వివరాలు సవివరంగా తెలియజేయాలన్నారు. పశువులను కొనుగోలు చేసేందుకు మహిళా పాడి రైతులకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలువురు మహిళా పాడి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, ఎంపీపీ హేమలత, సర్పంచ్‌లు లక్ష్మీనారాయణరెడ్డి, ఎర్రిస్వామి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి, ఎంపీడీఓ దశరథ రామయ్య, ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి, వెటర్నరీ డాక్టర్లు తులసీరామ్, దిలీప్ పాల్గొన్నారు.

సీనియర్ కబడ్డీ జట్టు ఎంపిక

గుంతకల్లు: ఉమ్మడి అనంతపురం జిల్లా సీనియర్ కబడ్డీ జట్టును ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంజునాథ్‌రెడ్డి, లక్ష్మణ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శివమణి (కదిరి), కపిల్‌దేవ్ (ఉద్దేహాళ్), సూరి (విడపనకల్లు), నరేష్ (తాడిపత్రి), అల్లీపీరా (గుంతకల్లు), హరి (పరిగి), ఆనంద్ (గుంతకల్లు), భార్గవ్ (యాడికి), ప్రదీప్ (మురడీ), మనోహర్ (గుంతకల్లు)ను ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ నెల 3వ నుంచి 5 వరకు విశాఖలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు.

క్లుప్తంగా

వలంటీర్ చికిత్సకు ప్రభుత్వం అండ



బెంగళూరులో చికిత్స పొందుతున్న కళ్యాణి

రాప్తాడు: మండలంలోని హంపాపురం గ్రామ వలంటీర్ ఈడిగ కళ్యాణి గత నెల 22న అనంతపురం నుంచి ఆటోలో వస్తుండగా రాత్రి 7 గంటల సమయంలో హంపాపురం సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైంది. మొత్తం ఐదుగురు గాయపడ్డారు. కళ్యాణి తలకు తీవ్ర గాయం కావడంతో బెంగళూరులోని సెయింట్ జాన్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వలంటీర్‌గా విశిష్ట సేవలు అందిస్తున్న కళ్యాణికి ఇటీవలే ప్రభుత్వం సేవా వజ్ర అవార్డు ప్రకటించింది. దీంతో ఆమె ఈ నెల 21న స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును సైతం అందుకుంది. ఆమె పరిస్థితి గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ముఖ్యమంత్రి... కళ్యాణి శస్త్రచికిత్స కోసం రూ.5 లక్షలను మంజూరు చేశారు. బాధితురాలికి అండగా నిలిచిన ప్రభుత్వానికి ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదంలో ఈఓకు తీవ్రగాయాలు



ఎర్రిస్వామి

యాడికి/వజ్రకరూరు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో యాడికి మేజర్ పంచాయతీ కార్యదర్శి ఎర్రిస్వామి తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు... ఉరవకొండలో నివాసముంటున్న ఎర్రిస్వామి రోజూ విధులకు ద్విచక్ర వాహనంపై యాడికి గ్రామానికి వచ్చి వెళ్లేవారు. ఈ క్రమంలో బుధవారం తన విధులు ముగించుకున్న అనంతరం రాత్రి 8 గంటలకు ద్విచక్ర వాహనంపై ఉరవకొండకు బయలుదేరారు. గుత్తి, గుంతకల్లు మీదుగా రాత్రి 10గంటలకు వజ్రకరూరు మండలం గంజికుంట క్రాస్ వద్దకు చేరుకోగానే నియంత్రణ కోల్పోవడంతో వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. అటుగా వెళుతున్న వారు గుర్తించి 108 అంబులెన్స్ ద్వారా ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి చేరుకుని వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం తొలుత అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అనంతరం బెంగళూరుకు తరలించారు.

దొంగను పట్టుకున్న స్థానికులు

రాయదుర్గం టౌన్: స్థానిక వినాయక సర్కిల్‌లోని గణేష్ జువెలరీ షాపులో ఓ వ్యక్తి సినీఫక్కీలో రెండు తులాల బంగారు గొలుసు చోరీ చేసి, ఉడాయించాడు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంబడించి దుండగుడిని పట్టుకున్నారు. వివరాలు... గురువారం రాత్రి 8 గంటలకు గొలుసు కొనుగోలు చేసేందుకు వచ్చిన వ్యక్తి... యజమాని జగన్నాథ్ కళ్లు కప్పి బంగారు గొలుసును తీసుకుని ఉడాయించాడు. యజమానితోపాటు గమనించిన స్థానికులు వెంటనే వెంటపడ్డారు. కొద్ది దూరంలోనే మొలకాల్మూరు రోడ్డు బెస్ట్ షాపింగ్ మాల్ వద్ద పట్టుకుని దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు.

తప్పు చేస్తే బుక్ అవుతారు!

- ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలు
- పరీక్షల నిర్వహణలో ఆధునిక సాంకేతికత
- పేపరు లీకైతే ఏ విద్యార్థికి కేటాయించిందో ఇట్టే తెలిసిపోతుంది
- తప్పిదాలకు జైలు శిక్ష తప్పదన్న ఆర్జేడీ



మాట్లాడుతున్న ఆర్జేడీ రాఘవరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఈ సారి పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు, విధుల్లో ఉండే ఉద్యోగులు ఏ మాత్రం పేపర్ లీక్‌కు కారణమైతే అడ్డంగా బుక్ అయిపోతారు. ఇందుకు సంబంధించిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వం సమకూర్చుకుంది. ఈ నెల 18వ తేదీ నుంచి 30 వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయి. రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష సమయం ఉంటుంది.

గత ప్రభుత్వంలో లీకుల పర్వం..

గత ప్రభుత్వంలో పదో తరగతి పరీక్షల సమయంలో పేపరు లీకై రాష్ట్రమంతా హల్‌చల్ అయ్యేది. అధికార యంత్రాంగం ఎంత పకడ్బందీ చర్యలు తీసుకున్నా రాష్ట్రంలో ఎక్కడో ఓ చోట పేపరు లీకు వార్తలు వెలుగు చూసేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విద్యారంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవసరమైన అన్ని సదుపాయాలు సమకూర్చింది. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దింది. మెరుగైన మానవ వనరులను ఈ ప్రపంచానికి అందించే క్రమంలో ఇంత కాలం ప్రభుత్వం పడిన శ్రమకు ఆశించిన మేర ఫలితాలు దక్కాయి. ఇప్పటి వరకూ అన్నింటా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ముందజలో నిలుస్తూ వచ్చారు.

లీకు వీరులెవరో తెలిసిపోతుంది..

పొరబాటున ఎవరైనా లీక్ చేసినా ఆ ప్రశ్నపత్రం ఏ సెంటర్ నుంచి వచ్చింది, ఆ సెంటర్‌లోని ఏ గది విద్యార్థికి సంబంధించినది కూడా ఇట్టే తెలిసిపోయే సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. ప్రశ్నపత్రం బయటకు తీసుకొచ్చి జిరాక్స్ చేయించినా, ఫొటో తీసినా అందులో పొందుపరిచిన కంటికి కనిపించని నంబరు ఆధారంగా ఏ కేంద్రంలోని విద్యార్థికి చెందినదో తెలిసిపోతుంది. దీంతో అసలు కారకులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం..

గతంలో ఎన్నడూ లేని విధంగా పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఈసారి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సదుపాయం కల్పించనున్నారు. హాల్‌టికెట్ చూపిస్తే చాలు ప్రయాణం చేయొచ్చు. అల్ట్రా పల్లెవెలుగు, పల్లెవెలుగు సర్వీసుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం ఉంటుంది. పరీక్ష కేంద్రాలు కలిగిన రూట్లకు, పరీక్షల వేళలకు అనుగుణంగా ప్రత్యేకంగా ఈ బస్సులను నడపనున్నారు.

ఫెయిల్ అయిన విద్యార్థులకు చివరి అవకాశం

ఈసారి పాత సిలబస్‌తో పరీక్షలు ఉంటాయి. వచ్చే సంవత్సరం నుంచి మారిన కొత్త సిలబస్‌కు అనుగుణంగా పరీక్షలు నిర్వహించనున్నారు ఈ నేపథ్యంలో గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఇదే చివరి మంచి అవకాశం. పరీక్ష ఫీజు చెల్లించిన ఫెయిలైన విద్యార్థులందరూ ఈసారి పరీక్షలు రాసే అవకాశాన్ని మిస్ కావొద్దంటూ అధికారులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో పదో తరగతి విద్యార్థులు ఇలా			
జిల్లా	ప్రభుత్వ	ప్రైవేట్	సెంటర్లు
అనంతపురం	31,330	8,733	142
శ్రీసత్యసాయి	22,002	5,553	115
మొత్తం	40,063	27,555	257

అప్రమత్తంగా ఉండాలి

పదో తరగతి పరీక్షల నిర్వహణ విధుల్లో ఉండే ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి. ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించినా ఇబ్బందులు పడతారు. ముఖ్యంగా ప్రశ్రపత్రాలు లీక్ అంశంపై జాగ్రత్తగా ఉండాలి. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో ప్రశ్నపత్రాలు రూపొందించడంతో లీక్ చేస్తే దొరికిపోతారు. అనవసరంగా సమస్యలు కొని తెచ్చుకోవద్దు.

– గోవిందునాయక్, అసిస్టెంట్ కమిషనర్, ప్రభుత్వ పరీక్షలు

ప్రశాంతంగా జరగాలి: ఆర్జేడి

ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా చూడాలని ప్రాథమిక విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) రాఘవరెడ్డి ఆదేశించారు. పది పరీక్షల నిర్వహణపై గురువారం అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఆడిటోరియంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో ఆయన సమీక్షించారు. పరీక్షల నిర్వహణ బాధ్యత చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులపై ఉంటుందన్నారు. ప్రతి కేంద్రంలోనూ సీఎస్‌లు, డీఓలు, ఇన్విజిలేటర్లు సమన్వయంతో పని చేస్తే ఎలాంటి సమస్యలు తలెత్తవన్నారు. మీడియా, ప్రైవేట్ వ్యక్తులెవరినీ కేంద్రాల్లోకి అనుమతించొద్దన్నారు. పరీక్షల సమయంలో అక్కడ విధుల్లో ఉండే పోలీసులు, ఏఎన్ఎం, ఇన్విజిలేటర్లు, అటెండర్ల మొబైల్ ఫోన్లను చీఫ్ సూపరింటెండెంట్ వద్ద డిపాజిట్ చేసుకోవాలన్నారు. నామినల్ రోల్‌లో పేపర్‌కోడ్, మీడియం విషయంలో విద్యార్థి ఏదైనా సవరణలు రాతపూర్వకంగా కోరితేనే చేయాలన్నారు. ఫొటో అటెండెన్స్ షీట్‌లో విద్యార్థులు, ఇన్విజిలేటర్ల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఓఎంఆర్ షీట్‌లో పార్ట్–1,2,3 విభాగాలు ఉంటాయన్నారు. గణితం పరీక్ష రోజు గ్రాఫ్ పేపరును, సోషల్ పరీక్ష రోజు మ్యాప్ పేపర్‌ను జవాబు పత్రానికి అనుసంధానించేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రశ్నపత్రాల తయారీలో ఈసారి ప్రభుత్వం సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెచ్చిందని, ఎక్కడ బయటకు వచ్చినా కారకులు దొరికిపోతారని హెచ్చరించారు. చివరికు మొబైల్‌లో ప్రశ్రపత్రం ఫొటో తీసి బయటకు పంపితే ఏ నంబరు మొబైల్ నుంచి తీసిందో కూడా తెలిసిపోతుందన్నారు. ఎవరిస్థాయిలో వారు జాగ్రత్తగా పని చేయాలని, ఏవైనా తప్పిదాలకు కారకులైతే మాత్రం కటకటాల పాలవుతారని హెచ్చరించారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్, డిప్యూటీ డీఈఓలు శ్రీనివాసరావు, శ్రీదేవి, డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తంబాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జర్నలిస్ట్ క్రికెట్ టోర్నీ



దత్తారెడ్డిని సన్మానిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా రాష్ట్ర స్థాయి జర్నలిస్ట్ క్రికెట్ టోర్నీ కొనసాగుతోంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో శ్రీసత్యసాయి, వైజాగ్ జట్లు గెలుపొందాయి. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై, పోటీలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర స్థాయి జర్నలిస్ట్ క్రికెట్ టోర్నమెంట్‌కు అద్భుతమైన సౌకర్యాలు కల్పిస్తున్న ఆర్డీటీని అభినందించారు. అనంతరం ఏపీ రంజీ జట్టుకు ఎంపికైన ఎంకే దత్తారెడ్డిని సన్మానించారు. అలాగే కలెక్టర్ అరుణ్‌బాబును ఏపీడబ్ల్యూజేయూ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేయూ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి, టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు వెంకటేష్, ఖాన్, షాకీర్, విజయ్‌రాజు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకం



జాతీయ పోటీల్లో గోల్డ్, బ్రాంజ్ పతకాలు సాధించిన పూజిత, కరిష్మా

గుత్తి: పుదుచ్చేరిలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ తైక్వాండో లీగ్–2024 పోటీల్లో గుత్తి విద్యార్థినులు సత్తా చాటారు. 10వ తరగతి చదువుతున్న పి. పూజిత బంగారు పతాకాన్ని సాధించగా , కరిష్మా బ్రాంజ్ మెడల్ దక్కించుకుంది. గుత్తిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న వీరు ఏపీ తరపున జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని కోచ్ సాయితేజ అభినందించారు.

అభివృద్ధి బాటలో డీసీఎంఎస్

- బోర్డు మీటింగ్‌లో ఛైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి



డీసీఎంఎస్ బోర్డు మీటింగ్‌లో పాల్గొన్న తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యులు, అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ అందిస్తున్న సేవల కారణంగా జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)ను అభివృద్ధి బాట పట్టించినట్లు ఆ సొసైటీ ఛైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన బోర్డు మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా రైతులకు అందించే సేవలు, ప్రధానంగా ఎరువుల పంపిణీ, ఇతర అంశాలపై సమీక్షించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ రూ.11.54 కోట్లకు పైగా విలువ చేసే ఎరువులు, రూ.25,.45 లక్షల పురుగు మందులు, ఇతర వ్యాపారాల ద్వారా రూ.1.02 కోట్లు... మొత్తంగా రూ.12.82 కోట్ల మేర లావాదేవీలు జరిగాయన్నారు. జగన్ సర్కారు అందిస్తున్న ప్రోత్సాహంతో అనంతపురం, తాడిపత్రి, ధర్మవరం, హిందూపురం, కదిరి, పెనుకొండ, కళ్యాణదుర్గం డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా ముున్ముందు మరింత మెరుగైన సేవలు అందిస్తామన్నారు. సమావేశంలో డైరెక్టర్లు బి.శ్రీరామరెడ్డి, జబీవుల్లా, క్రిష్టప్ప, సుమంగళమ్మ, నాగమ్మ, బిజినెస్ మేనేజర్ టి.విజయభాస్కర్, అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

విడపనకల్లు: లారీ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. మరొకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... వజ్రకరూరు మండలం కమలపాడుకు చెందిన బోయ ఓబులేసు కుమారుడు బోయ రాజేంద్ర (23) గురువారం తన చెల్లెలు అత్త కాంతమ్మను, బేబీ వైష్ణవిని ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని గడేకల్లుకు బయలుదేరాడు. హంచనహాల్ సమీపంలోకి చేరుకోగానే బళ్లారిపై వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఘటనలో రోడ్డుపై పడిన రాజేంద్ర తల మీదుగా లారీ చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాంతమ్మ తీవ్రంగా గాయపడింది. లారీ దాదాపు 20 మీటర్లు దూరం వెళ్లి బోల్తాపడింది. డ్రైవర్‌ను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అప్పటికే లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పేదలకు పోషకాహారం

- నేటి నుంచి రాగిపిండి పంపిణీ
- రూ.11తో కార్డుకు కిలో ప్యాకెట్ అందజేత
- ప్రజల ఆరోగ్య భద్రతకు జగన్ సర్కారు పెద్దపీట



బియ్యం, సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: పేదల ఆరోగ్య భద్రతకు జగన్ సర్కార్ పెద్ద పీట వేస్తోంది. ఇప్పటికే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పోషకాలతో కూడిన బియ్యంతో పాటు రాగులు, జొన్నలు ఉచితంగా ఇస్తోంది. రూ.16తో ఫోర్టిఫైడ్ గోధుమపిండి సరఫరా చేస్తోంది. ఈ క్రమంలోనే మరింత బలమిచ్చేందుకు రాగిపిండిని ప్యాకెట్ రూపంలో అందించేందుకు చర్యలు చేపట్టింది. శుక్రవారం నుంచి జిల్లాలో బియ్యం, సరుకులతో పాటు రాగిపిండిని కూడా పంపిణీ చేయనున్నారు.

రూ.11తో..

మార్కెట్‌లో కిలో రాగి పిండి ధర రూ.50 నుంచి రూ.60 వరకు ఉంది. అయితే ప్రభుత్వం పేదలపై ఆర్థిక భారం లేకుండా రాగిపిండి అందించనుంది. రాగులను ప్రాసెసింగ్ చేసి పిండి ఆడించి ప్యాకింగ్ చేసి రవాణా చేసేందుకు అయ్యే ఖర్చును మాత్రమే ధరగా నిర్ధారించింది. రూ.11తో కార్డుదారులకు అదే ధరతో రాగిపిండి అందుబాటులో ఉంచింది.

ఆరోగ్య ప్రయోజనాలెన్నో..

రాగులు, రాగిపిండిలో పౌష్టికాహార విలువలు అధికంగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల పలు ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. శరీరంలో చలువని పెంచేందుకు రాగిజావ దోహదపడుతుంది. ఎముకలు దృఢంగా ఉంటాయి. ఎదిగే పిల్లల్లో మెదడు చురుగ్గా ఉండటానికి సహాయపడుతుంది. నాడీ వ్యవస్థ పనితీరును పెంచుతాయి.

సక్రమంగా పంపిణీ జరగాలి : జేసీ

బియ్యం, నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాగిపిండి పంపిణీ నేపథ్యంలో అధికారులతో గురువారం జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఫోర్టిఫైడ్ బియ్యం కార్డులోని ప్రతి సభ్యునికి ఐదు కిలోలు, అంత్యోదయ (ఏఏవై) కార్డుదారులకు 35 కిలోలు ఉచితంగా ఇవ్వాలన్నారు. ఏఏవై కార్డులకు కిలో చక్కెర రూ.13.50కు ఇవ్వాలని, మిగిలిన కార్డుదారులకు అర్ధకిలో రూ.17 ప్రకారం ఎండీయూ వాహనాల ద్వారా అందించాలన్నారు. కిలో బియ్యం బదులు కిలో రాగి పిండి రూ.11తో పంపిణీ చేయాలని ఆదేశించారు. సరుకుల పంపిణీలో ఎక్కడా అవకతవకలు చోటు చేసుకోకుదన్నారు. సరుకులు పంపిణీ, తుకాలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తీవ్రంగా పరిగణిస్తామన్నారు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దారు, సీఎస్‌డీటీలు సరుకుల పంపిణీ సజావుగా జరగడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బాలల రక్షణ చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఓంకార్

అనంతపురం: బాల్య న్యాయ చట్టంపై పోలీసు అధికారులు, జువైనల్/శిశు సంక్షేమ అధికారులు, ప్రత్యేక జువైనల్ పోలీస్ యూనిట్ సభ్యులకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎ.ఓంకార్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. నేర ప్రవృత్తికి పాల్పడుతున్న పిల్లలకు చట్టపరంగా ఎలాంటి రక్షణ ఇవ్వాలి, వారిని ఎలా సంరక్షించాలి అంశంపై అవగాహన కల్పించారు. జువైనల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ యాక్ట్)–2015 విధానాలు, నియమాలు వివరించారు. క్రూరమైన నేరాలకు పాల్పడి, వివాదస్పదమైన సెక్షన్లకు బాధ్యులైన పిల్లలతో ఎలా వ్యవహరించాలో సూచించారు. చట్టం, నిబంధనల మేరకు నివేదికలను జువైనల్ జస్టిస్ బోర్డు ఛైర్మన్‌కు సమర్పించడంలో జిల్లా ప్రొబేషన్ అధికారి పాత్రను వివరించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సి.ఇటికె నల్లప్ప మాట్లాడుతూ.. ముందస్తు అరెస్ట్, రిమాండ్ దశలో న్యాయ సేవల లభ్యత, బాల నేరస్తుల వయస్సు నిర్ధారణ, పిల్లలను అబ్జర్వేషన్ హోంకు తరలించే విధానంపై అవగాహన కల్పించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విద్యాపతి, పోలీసు శాఖ సలహాదారు సాయినాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన ఓటమి ఖాయం

- ప్యాకేజీ పడితే ఒకలా, లేకపోతే మరోలా పవన్ మాట్లాడతారు
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి

అనంతపురం టవర్ క్లాక్: వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఓటమి ఖాయమని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆ రెండు పార్టీలు సీట్లు అమ్ముకుని డబ్బులు పోగేసుకుంటున్నాయని మండిపడ్డారు. టీడీపీ ప్రజలకు చేసిన మంచి ఏదీ లేకపోయినా ఇతరులపై బురదజల్లుతోందని ధ్వజమెత్తారు. గురువారం అనంతపురంలో మీడియాతో ఆయన మాట్లాడారు. పవన్ కళ్యాణ్‌కు కేటాయించిన 24 అసెంబ్లీ సీట్లలో కూడా పోటీ చేసేందుకు అభ్యర్థులు లేరన్నారు. మొదటి నుంచి పవన్‌ను గమనిస్తే ప్యాకేజీ పడితే ఒకలా, ప్యాకేజీ పడకపోతే మరోలా మాట్లాడుతుంటారని ఆరోపించారు. మూడు పెళ్లిళ్ల వ్యవహారంపై సమాధానం చెప్పని ప్యాకేజీ స్టార్ నాలుగో పెళ్లాం అంటూ మాట్లాడటం చూస్తే అతడేమైనా 'గే' నా అనే అనుమానం కలుగుతోందన్నారు. సీఎం జగన్ పాలనలో మంచి జరిగితేనే ఓటు వేయాలని అడిగే దమ్ము తమకుందన్నారు. అదే చంద్రబాబు పాలనలో మేలు జరిగి ఉంటే ఓటు వేయండనే దమ్ము మీకుందా అని టీడీపీ నేతలను ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో ఏ సంక్షేమ పథకాలు అమలు చేశారో చెప్పాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175కి 175 స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. రాప్తాడులో పరిటాల కుటుంబం తనను ఓడించలేదన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు ఈ నెల 4న రాప్తాడులో బహిరంగ సభ నిర్వహిస్తున్నాయని.. తనపై ఆ రెండు పార్టీలు చేసిన అవినీతి ఆరోపణలు నిరూపించాకే రాప్తాడులో అడుగుపెట్టాలన్నారు. తాను రూ.500 కోట్లు సంపాదించానంటూ ఎల్లో మీడియా తప్పుడు కథనాలు ప్రచురించిందని ధ్వజమెత్తారు. చంద్రబాబు చెప్పినట్లు రూ.2 వేల కోట్లు కానీ, ఎల్లో మీడియా చెప్పినట్లు రూ.500 కోట్లు కానీ తాను సంపాదించినట్లు నిరూపిస్తే ఆస్తులను వారికే రాసిస్తానన్నారు. ఈ సమావేశంలో గొర్రెలు, మేకల కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహగౌడ్, రామగిరి వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాగేంద్ర పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు


గుమ్మఘట్ట: మండలంలోని భూపసముద్రం గ్రామ సచివాలయం తలుపులు బద్దలుగొట్టడం, ఫర్నీచర్‌ను ధ్వంసం చేస్తూ సిబ్బందిని అసభ్య పదజాలంతో దూషించిన చంద్రశేఖర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. పలుమార్లు హెచ్చరించినా ఆయన ధోరణిలో మార్పు రాకపోవడంతో పంచాయతీ కార్యదర్శి రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.


వృద్ధుడి ఆత్మహత్య



మృతుడు నరసింహులు

కళ్యాణదుర్గం రూరల్: కుటుంబ కలహాలతో విసుగు చెందిన ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం పరిధిలోని మారంపల్లి కాలనీలో నరసింహులు (70), వరలక్ష్మి దంపతులు నివాసముంటున్నారు. కుటుంబంలో సమస్యల కారణంగా ఇద్దరూ తరచూ గొడవపడేవారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న నరసింహులు గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.





రాయదుర్గం ప్రభుత్వాస్పత్రిలో జన్మించిన లీపు బేబీలు

‘లీపు’ బేబీలు



సర్వజనాస్పత్రిలో జన్మించిన పసికందు

అనంతపురం మెడికల్/రాయదుర్గం టౌన్: నాలుగేళ్లకు ఒకసారి వచ్చే ఫిబ్రవరి 29న అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో 14 మంది శిశువులు జన్మించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ జరిగిన కాన్పుల్లో ఎనిమిది మంది ఆడశిశువులు ఉండడం గమనార్హం. లీపు రోజున పుట్టిన వీరిని ఆస్పత్రి సిబ్బంది అపురూపంగా చూసుకున్నారు. అలాగే రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రిలో ఓ ఆడ, మరో మగ శిశువు జన్మించారు. కర్ణాటకలోని కానహొసహళ్లికి చెందిన ముజమ్మిల్ భార్య షబానా మొదటి కాన్పు కోసం రాయదుర్గంలోని పుట్టింటికి వచ్చారు. ఈ క్రమంలో గురువారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో ఏరియా ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు. మధ్యాహ్నం మగబిడ్డకు ఆమె జన్మనిచ్చారు. గుమ్మఘట్ట మండలం గోనబావి గ్రామానికి చెందిన సురేష్ భార్య మీనాక్షి గురువారం తెల్లవారు జామున 5 గంటలకు ఏరియాలో ఆస్పత్రిలో ఆడబిడ్డకు జన్మనిచ్చారు.

క్లుప్తంగా

గాయత్రికి బంగారు పతకం


గవర్నర్ తమిళసై నుంచి బంగారు పతకం అందుకుంటున్న నాట్యకళాకారిణి గాయత్రి

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన నాట్య కళాకారిణి గాయత్రి బంగారు పతకం అందుకుని జిల్లా ఖ్యాతిని చాటింది. నాట్యంపై మక్కువతో తల్లి పద్మావతి ప్రోత్సాహంతో నాట్యాచార్యులు పట్నం శివప్రసాద్, ఆపై డాక్టర్ వసంత కిరణ్ వద్ద నాట్యంలో శిక్షణ తీసుకుంది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడిలో మాస్టర్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, మాస్టర్ ప్రోగ్రామ్‌లో అత్యధిక మార్కులు పొందింది. తెలుగు యూనివర్శిటీ 16వ స్నాతకోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకుంది.

పాడి రైతులకు బ్యాంక్ ఖాతాలు

ఆత్మకూరు: జగనన్న పాలవెల్లువలో భాగంగా పాలు పోసే మహిళా పాడి రైతుల ఖాతాల్లోకి నేరుగా డబ్బు జమ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గురువారం మండలంలోని పంపనూరు, పంపనూరు తండా, గొరిదిండ్ల, ముట్టాల గ్రామాల్లో ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ స్టీఫెన్ కుమార్, సిబ్బంది మహిళా పాడి రైతులకు బ్యాంక్ ఖాతాలు చేశారు. ఇంకా బ్యాంక్ ఖాతాలు లేని మహిళా పాడి రైతులు అందరికీ తప్పకుండా అకౌంట్లు ఓపెన్ చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళా పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ మేనేజర్ తెలిపారు.

నేటి నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు


విద్యుత్ దీపాలంకరణలో మొదటి రోడ్డు శివాలయం

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటి రోడ్డు కాశీ విశ్వేశ్వరాలయంలో శుక్రవారం నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శ్రీశైల మహాక్షేత్రాన్ని తలపిస్తూ సాగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు అంటే 1న కలశస్థాపన, ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం మయూర వాహనంపై పార్వతీ పరమేశ్వరులు భజన బృందాలు, కళారూపాల ప్రదర్శనల నడుమ పురవీధుల్లో దర్శమిస్తారు. అలాగే 2న వ్యాఘ్ర వాహనం 3న శేషవాహనం 4న హంస వాహనం, 5న రావణబ్రహ్మ వాహనం, 6న కైలాసవాహనం, 7న గజ వాహన సేవలుంటాయి. 8న మహాశివరాత్రి సందర్భంగా లింగోద్భవ కాలంలో శివపార్వతుల కల్యాణం జరుగుతుంది. 9న బ్రహ్మ రథోత్సవ వేడుకలు, 10న అశ్వవాహనం 11న త్రిశూలస్నానం, ధ్వజారోహణంతో వేడుకలు ముగుస్తాయి.

అంధుల వివాహం ఆదర్శం


వధూవరులకు సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కల్చరల్: సాయిట్రస్టు వారు చేస్తున్న ఆదర్శ వివాహాలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఇక్తూస్ ప్రార్థనా మందిరంలో సాయిట్రస్టు ఆధ్వర్యంలో అంధుల ఆదర్శ వివాహం జరిగింది. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆత్మీయ అతిథిగా విచ్చేసి క్రిస్టియన్ మ్యారేజీ గవర్నమెంట్ ఆఫ్ ఏపీ రెవరెండ్ అనిల్ కుమార్ జారీ చేసిన మ్యారేజీ సర్టిఫికెట్‌ను అంధ వధూవరులకు అందించారు. కులమతాలకు సంబంధం లేకుండా ప్రతి వివాహం తప్పనిసరిగా రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. ట్రస్టు అధ్యక్షుడు విజయ్ సాయికుమార్ కుటుంబం, వైఎస్సార్‌సీపీ నాయకురాలు శ్రీలత ఆంథోని రెడ్డి దంపతులు మాంగల్యం, నూతన వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, బీజేపీ స్పోక్స్‌పర్సన్ వెంకటేశ్వరరెడ్డి, పాస్టర్ మనోహర్, రాఘవేంద్ర, నాయక్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడారు. 55 ఏళ్లు పైబడిన కార్మికులందరికీ నెలకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. ఇంటి స్థలం, ఆరోగ్య బీమా, తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. కార్మికుల పిల్లలందరికీ విద్య, వైద్య సదుపాయం, స్కాలర్‌షిప్ అందించాలని కోరారు. ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, జాఫర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టండి

- టీడీపీ ఏనాడైనా.. మీ బాగోగులు పట్టించుకుందా?
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 27, 28, 29 డివిజన్లలో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'


పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం. మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని 27, 28, 29 డివిజన్లలో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకందించిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి కరపత్రాలను ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేయగా.. మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా ఉంటామని ప్రజలు సంతోషంతో తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఏనాడైనా సంక్షేమం, అభివృద్ధి గురించి పట్టించుకుందా? అన్నారు. ప్రజారోగ్యం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా నవరత్నాల ద్వారా పేద, సామాన్య మధ్య తరగతి ప్రజల ఆర్థిక స్థితిగతులను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మార్చేశారన్నారు. ఖరీదైన విద్య, వైద్యాన్ని ప్రజలకు చేరువ చేశారన్నారు.

వైఎస్సార్‌సీపీదే విజయం..

కేవలం నాలుగన్నరేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల నుంచి భారీ స్థాయిలో ఆదరణ లభించిందన్నారు. రానున్న ఎన్నికల్లోనూ మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ అధినేత చంద్రబాబు జనసేన పవన్ కళ్యాణ్‌లు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై వ్యక్తిగత కక్ష్య పెంచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన ఉమ్మడిగా నిర్వహించిన జెండా సభకు స్పందన అంతంత మాత్రంగానే ఉందన్నారు. గతంలో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ స్థాపించి కాంగ్రెస్‌లోకి విలీనం చేశారని.. ఈ ఎన్నికల తర్వాత టీడీపీ, జనసేన ఉండవన్నారు. భయపడేవాళ్లంతా నా చుట్టూ ఉండాలని అన్నట్లుగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతున్నారని తెలిపారు. ప్రత్యేక హోదా విషయంలో వాళ్లంగా ఏం చేశారో ప్రజలకు తెలుసన్నారు. అందరూ కలసి వచ్చినా.. విడివిడిగా వచ్చినా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎదుర్కొనలేరన్నారు. రాజకీయ ప్రజాక్షేత్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎదురించే సత్తా లేదని చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు తెలుసు అని పేర్కొన్నారు. అందుకే చివరి ప్రయత్నంగా అందరూ కలిసి వస్తున్నారన్నారు.

భారీగా ఉద్యోగాల కల్పన

గత టీడీపీ ప్రభుత్వం ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ ఏమాత్రం చేపట్టలేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ ద్వారా లక్ష మందికి పైగా ఉద్యోగాలు కల్పించారన్నారు. ఆరోగ్య శాఖలోనూ 50 వేలకు పైగా పోస్టులను భర్తీ చేయడం జరిగిందని వెల్లడించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్లు సాకే చంద్ర, అనిల్ కుమార్‌రెడ్డి, వెంకటరమణ, బాలాంజినేయులు, భోగాతి జయమ్మ, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, పార్టీ సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రిలాక్స్ నాగరాజు, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, శ్రీదేవి, సైఫుల్లాబేగ్, నాయకులు జావెద్, భోగాతి రవి, రామయ్య, రాధాకృష్ణ, జానీ, వనారస బలరాం, సాకే కుళ్లాయస్వామి, మిద్దె నగేష్, ఖాదర్‌బాషా, నారాయణరెడ్డి, శివయ్య, వంశీ, ఖాజా, రాధ, అంజలి, గౌరి తదితరులు పాల్గొన్నారు.

నేడు 26వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ..

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 26వ డివిజన్‌లో శుక్రవారం ఉదయం 7:30 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆ డివిజన్‌లోని ఆర్టీఓ కార్యాలయం రోడ్డు నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు రావాలన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన అంబేడ్కర్ అడుగుజాడల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తున్నారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఒక మతానికి, కులానికి సంబంధించిన వ్యక్తి కాదన్నారు. సమ సమాజ స్థాపనకు కృషి చేసిన అందరి వారని కొనియాడారు. ప్రస్తుతం సీఎం జగన్ ఆయన అడుగు జాడల్లోనే నడుస్తూ గ్రామ స్వరాజ్యం స్థాపించి పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తూ వారి ఉన్నతికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ మారుతి, స్థానిక సర్పంచ్ అంకె పరిమళ, పలువురు ఎంఆర్‌పీఎస్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో జాప్యం చేయొద్దు

- మోటర్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలి
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు
- ఇంజినీర్లను ఆదేశించిన మేయర్ వసీం


మాట్లాడుతున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయ్ భాస్కర్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: నగర ప్రజలకందించే నీటి సరఫరాలో ఎటువంటి జాప్యం చేయకూడదు. ఎప్పటికప్పుడు మోటర్లను పరిశీలించడంతో పాటు డ్యాం, ముద్దలాంపురం ఫిల్ట్రేషన్ పాయింట్‌ను తనిఖీ చేయాలి. నగర ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని మేయర్ వసీం ఇంజినీర్లను ఆదేశించారు. గురువారం నగర పాలక సంస్థలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యతో కలసి ఇంజినీర్లతో సమావేశమయ్యారు. నీటి సరఫరా జాప్యం విషయంలో ఇంజినీర్ల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మోటరు రిపేరీ విషయాన్ని కనీసం పాలకవర్గానికి ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ఆ సమయంలో ఇంజినీర్ల నోట మాట రాలేదు. పబ్లిక్ హెల్త్ వారు రిపేరీ చేయించాల్సి ఉందన్నట్లు చెప్పుకొచ్చారు. అందుకు మేయర్, డిప్యూటీ మేయర్లు ఏకీభవించలేదు.

పంపింగ్ ఆగకూడదు

పీఏబీఆర్‌లో పంపింగ్ ఆపితే నగరానికి నీరు సరఫరా జరగాలంటే మరో నాలుగు గంటల సమయం పడుతుందని, అందుకు పంపింగ్ ఏమాత్రం ఆపకూడదన్నారు. రౌండ్ ద క్లాక్ మోటర్ రన్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక మోటర్‌పై నడిచే సమయంలో సౌత్, నార్త్ జోన్‌లో ఏదో ఒక వైపు నీటి సరఫరా ఆపాలన్నారు. ప్రస్తుతం సమస్య ఉన్న సౌత్‌జోన్‌కు నీరు సమృద్ధిగా వచ్చేలా చూడాలన్నారు. ఇంజినీర్లు ముందుచూపుతో వ్యవహరించాలన్నారు. మరో మోటర్ వచ్చే వరకూ అప్రమత్తంగా ఉండాలన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీరందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా నీటి సమస్య కన్పించకూడదని తెలిపారు.

వాహనాలు రిపేరీ చేయించాలి

మరమ్మతుకు గురైన వాహనాలను ఎప్పటికప్పుడు రిపేరీ చేయించాలన్నారు. నాల్గవ సర్కిల్‌లో కాంపాక్టర్ చెడిపోయి 18 రోజులవుతోందని అన్ని రోజుల పాటు మరమ్మత్తు చేయించకపోతే ఎలాగని ప్రశ్నించారు. అదేవిధంగా ఓ మెకానిక్‌ను అందుబాటులో ఉంచేలా చూడాలన్నారు. ఏదైనా సమస్య వచ్చినా తక్షణం వాటిని రిపేరీ చేయించాలన్నారు. సమావేశంలో ఈఈలు సూర్యనారాయణ, సుధారాణి, డీఈ చంద్రశేఖర్, సుభాష్, శేఖర్, ఏఈ బాబావలి, తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట


పేరూరు కురుగుండ్ల కాలనీలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


ఆకుతోటపల్లిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట వేశారు. మరోవైపు గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి ప్రజలకు కనిపిస్తున్నా ప్రతిపక్షాలకు కనిపించడం లేదని మండిపడ్డారు. గురువారం అనంతపురం రూరల్ మండల పరిధిలో వివిధ గ్రామాల్లో నిర్మించిన నూతన భవనాలను ప్రారంభించారు. ఉప్పరపల్లిలో గ్రామ సచివాలయం, రోడ్లు, డ్రైనేజీలను ప్రారంభించారు. ఆకుతోటపల్లిలో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అలాగే ఆలమూరులో సచివాలయం, వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలోనూ కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పక్కా భవనాలను నిర్మించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, సీనియర్ నాయకులు ఆకుతోటపల్లి నారాయణరెడ్డి, సర్పంచులు సావిత్రి శ్రీనివాసులు, గురుప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌దత్త రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రవిశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రామస్వామి, ఉప సర్పంచ్ బండి రమాదేవి, నల్లపరెడ్డి, రాజారెడ్డి, గోపాల్, మండల యూత్ కన్వీనర్ తాడిపత్రి శ్రీనివాసులు, ఆలమూరు చంద్రమౌళి, వెంకటేశ్వరరెడ్డి, పరమాసి రాజు, సుధీర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

రామగిరి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పేరూరు సమీపంలో కురుగుండ్ల కాలనీలో రెన్యూ గాలిమరల కంపెనీ ఆధ్వర్యంలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు పేదలు, రైతులను విస్మరించాయన్నారు. అయితే రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే కులం, మతం, ప్రాంతం, పార్టీలను చూడకుండా అన్ని వర్గాలకు న్యాయం చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే పేరూరు డ్యామ్‌కు హంద్రీ-నీవా నీటిని తీసుకురావడంతో పాటు, నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని చెరువులను నింపడం జరిగిందన్నారు. పేద ప్రజలను ఆదుకుంటున్న సీఎం జగన్‌ను ఎదుర్కోలేక చంద్రబాబు, పవన్‌లతో పాటు అనేక పార్టీలు కలసి కుట్రలు పన్నుతున్నాయన్నారు. అయినప్పటికీ అంతిమ విజయం వైఎస్సార్‌సీపీదే అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి మరోమారు పార్టీ జెండాను ఎగరవేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అంతకుముందు రెన్యూ కంపెనీ యాజమాన్యం ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, సర్పం,ఏలు రాజేష్, నరేంద్ర, సిద్ధన్న, రామ్మూర్తిలతో పాటు నాయకులు నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, ఆదిరెడ్డి, మల్లికార్జున, దాసరి మోహన్, ఆనంద్, నారాయణరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కంపోస్టు యార్డులో అగ్ని ప్రమాదం


కంపోస్టు యార్డులో చెలరేగిన మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది


పరిస్థితిని సమీక్షిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, కమిషనర్ మేఘస్వరూప్

అనంతపురం కార్పొరేషన్: కంపోస్టు యార్డులోని ఓపెన్ సైట్‌లో గురువారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. చెత్త దిబ్బలు అంటుకోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. గుత్తి రోడ్డు, రాజీవ్ కాలనీ ప్రాంత వాసులు భయాందోళనకు గురయ్యారు. విషయం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన సకాలంలో స్పందించి సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. ఈ క్రమంలో ఫైర్ ఇంజిన్లు, పోలీసు సిబ్బంది తదితరులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజిన్ ద్వారా మంటలార్పే ప్రయత్నం చేశారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, కమిషనర్ మేఘస్వరూప్ తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని, పరిస్థితిని సమీక్షించారు. ఇదిలా ఉండగా గతంలో ఎప్పుడైనా మంటలు వ్యాపిస్తే కంపోస్టు యార్డులో ఓ భాగంలో మాత్రమే నిప్పురవ్వలు వచ్చేవి. కానీ ఇప్పుడు కంపోస్టు యార్డు చుట్టూ మంటలు చెలరేగడం పలు అనుమానాలకు తావిస్తోంది. అందులోనూ కంపోస్టు యార్డులో మంటలు చెలరేగే ఫోటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై అధికారులు లోతుగా విచారణ చేసి, భవిష్యత్తులో ఇటువంటి సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పలు కాలనీల్లో కమిషనర్ పర్యటన


నీటి సరఫరాను పరిశీలిస్తున్న కమిషనర్ మేఘ స్వరూప్

అనంతపురం కార్పొరేషన్: నీటి సరఫరా విషయంలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని మరువకొమ్మ కాలనీ, హమాలీకాలనీ, మారుతీనగర్ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. తాగునీటి సరఫరాపై స్థానిక ప్రజలతో మాట్లాడారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. కొళాయిల ద్వారా నీరు సమృద్ధిగా రాకున్నా.. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని 12 పెద్ద, 5 చిన్న ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గురువారం 56 ట్రిప్పుల ద్వారా నీటినందించడం జరిగిందన్నారు. తాగునీటి ట్యాంక్ కోసం డీఈ చంద్రశేఖర్ 9849907387, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బిరెడ్డి 9703021788, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు 7702738209 నంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈ రామమోహన్ రెడ్డి, ఈఈ సూర్యనారాయణ, డీఈ చంద్రశేఖర్, ఏఈ బాబావలి తదితరులు పాల్గొన్నారు.

సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ట


ఆలయం ముందు హోమం చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని తలుపూరు గ్రామంలో గురువారం సుంకులమ్మ విగ్రహ ప్రతిష్టను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్టకు ముందు ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున హోమాలు జరిగాయి. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

ల్యాప్‌టాప్, డాక్యుమెంట్ల అందజేత

అనంతపురం: స్థానిక త్రీటౌన్ పోలీసులు సకాలంలో స్పందించి ఓ బాధితుడికి ల్యాప్‌టాప్, డాక్యుమెంట్లు అందజేశారు. వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన దివేష్ గుప్తా బెంగళూరు నుంచి ఓ కారులో ప్రయాణించారు. గురువారం ఉదయం అనంతపురం ఆర్టీసీ బస్టాండు వద్ద సదరు కారు డ్రైవర్ దివేష్ గుప్తాను దింపేసి వెళ్లిపోయారు. ఆ కారులో ల్యాప్‌టాప్, విలువైన డాక్యుమెంట్లు ఉన్న బ్యాగును మరచిపోయాడు. కొద్ది సేపటికి గుర్తు తెచ్చుకునేలోపు కారు హైదరాబాద్‌కు వెళ్లి పోయింది. ఆ కారు నంబర్ కూడా దివేషా గుప్తా గుర్తుంచుకోలేదు. వెంటనే అనంతపురం త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించాడు. సీఐ ధరణీ కిశోర్, సిబ్బంది రంగంలోకి దిగారు. జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న ఈ సర్వేలెన్స్‌కు అనుసంధానమైన నగరంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న సీసీ కెమెరాల ద్వారా ముందుగా కారు నంబర్ గుర్తించారు. తద్వారా కారు యజమానిని గుర్తించి ఆయన్ను సంప్రదించారు. వెంటనే ఆ బ్యాగును తెప్పించి దివేష్ గుప్తాకు అప్పగించారు. ల్యాప్‌టాప్‌తో పాటు విలువైన డాక్యుమెంట్లు ఉన్న బ్యాగును పోలీసులు సకాలంలో అందజేయడంతో పోలీసులకు దివేష్ గుప్తా కృతజ్ఞతలు తెలిపారు. అనంతపురం త్రీటౌన్ సీఐ ధరణి కిశోర్, సిబ్బందిని ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

హెడ్‌నర్సుల సేవలు మరువలేనివి


హెడ్‌నర్సులు విజయ, పార్వతిని సన్మానించిన దృశ్యం


సీనియర్ అసిస్టెంట్ రఘును సన్మానిస్తున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత

అనంతపురం మెడికల్: హెడ్‌నర్సులు విజయ, పార్వతి సేవలు మరువలేనివని ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు పేర్కొన్నారు. హెడ్‌నర్సులు ఉద్యోగ విరమణ సందర్భంగా గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వారికి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెడ్‌నర్సులను ఘనంగా సన్మానించారు. పేద ప్రజలకు సేవలందించి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో నంద్యాల గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్కేరు, నర్సింగ్ అసోసియేషన్ ఆర్‌బీ పద్మ, చాముండేశ్వరి, హెడ్‌నర్సులు ఆశాలత, రాజన్‌లత, భానులత, ఆదిలక్ష్మి, సంధ్య అరుణ, గీతా మాధురి, సురేఖ, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు వీడ్కోలు..

అనంతపురం మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న రఘు ఉద్యోగ విరమణ చేశారు. గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో రఘును ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత సన్మానించారు. కార్యక్రమంలో ఏఓ గిరిజ మనోహర రావు, మలేరియా అధికారి ఓబులు, డెమో ఉమాపతి, డిప్యూటీ డెమో త్యాగరాజు, గంగాధర్, ఎస్‌ఓ మహమ్మద్ రఫి, సూపరింటెండెంట్లు విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాస్, రమణ, సీనియర్ అసిస్టెంట్ కమలాకర్‌రాజు పాల్గొన్నారు.

హౌసింగ్ ఈఈగా ఎం.శైలజ

అనంతపురం టౌన్: గృహ నిర్మాణ సంస్థ అనంతపురం డివిజన్ ఈఈగా ఎం.శైలజ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఈఈగా పని చేస్తున్న కృష్ణారావును రాప్తాడుకు బదిలీ చేశారు. కళ్యాణదుర్గంలో ఈఈగా పని చేస్తున్న శైలజను అనంతపురం ఈఈగా నియమిస్తూ గృహ నిర్మాణ సంస్థ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు.

భూములు ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

అనంతపురం టవర్‌క్లాక్: దళితుల భూములు ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకే హరి అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో అనేక మంది దళిత గిరిజనులకు చెందిన భూములను కబ్జాదారులు ఆక్రమిస్తున్నారన్నారు. బొమ్మనహాళ్ మండలంలో దళితులకు చెందిన భూములను రెవెన్యూ అధికారులు డబ్బుకు లాలూచీ పడి ఇతరులకు ఆన్‌లైన్‌లో ఎక్కించడం అన్యాయమన్నారు. కళ్యాణదుర్గం, బెళుగుప్ప, ఆత్మకూరు మండలాల్లో దళితుల భూములను రెవెన్యూ భూ కబ్జాదారులు ఏకమై ఆక్రమించుకున్నారన్నారు. కార్యక్రమంలో తిమ్మప్ప, ఓబులేసు, ఈశ్వరయ్య, నారాయణ, భూ బాధితులు నాగరాజు, లక్ష్మన్న, ఆదెప్ప, లింగప్ప, ఆదెమ్మ, రుషింగప్ప తదితరులు పాల్గొన్నారు.